బావ ముద్దిమ్మంటే 'అమ్మతో చెపుతా అలా అన్నావంటే' అని బెదిరించే మరదళ్ళుండటం సహజం. మరి ముద్దివ్వకపోతే మా అమ్మతో చెబుతానని బ్లాక్‌మెయిల్ చేసే మరదళ్ళూ వుంటారు పాపం గోపాలంలాంటి అమాయకుల ప్రాణాలకి!

# బ్లాక్ మెయిల్

## ఆర్.యస్.కె. మూర్తి

"ఎవరు ఎవర్ని బ్లాకుమెయిలు చేస్తున్నారంటారు?" అని అడుగుతూ క్లబ్బులోకి అడుగెట్టేడు, మహారాజ పోషకుడు.

ఆయన ఈ క్లబ్బుకి మాత్రమేగాక యింకా ఎన్నింటికో, ఎందరికో మహారాజ పోషకుడని ప్రతీతి! అయితే అవన్నీ రుజూలూ, సాక్ష్యాలూ లేని నిజాలు.

"ఎవరో ఒకరు, మరెవరో యింకొకర్ని, బ్లాకుమెయిలు చేయటం గూర్చికాదు, మేం మాటలాడుకోటం? ఈ దేశంలో, ఈనాడు, అందర్నీ, అన్ని సమయాల్లోను, బ్లాకుమెయిలు చెయ్యగల శక్తి ఎవరికుంది? అదీ ప్రశ్న—" వివరిస్తూ బల్లగుద్దాడు—రాజపోషకుడు.

ఆయనలా బల్లగుద్దిన జోర్సుకి ఎదుటి గోడకున్న అమ్మవారి ఫోటో విలాసంగా కదిలి, కులాసాగా నవ్వేసింది. అదలా వుండగా

ఈ రాజపోషకుడు ఈ క్లబ్బుకే గాక ఇంకా చాలావాటికి,చాలమందికి రాజపోషకు డనటానికి రుజూలూ సాక్ష్యాలూ బోలెడన్ని. ఫర్ ఎగ్జాంపిల్, ఆయనెప్పుడూ 'ఫామిలీ'తో తప్ప సినిమా కెళ్ళడు. ఎటు తిరిగీ వచ్చినచిక్కేమిటంటే, తఫాకొకరుగా ఆయనతో సినిమాకొచ్చే 'ఫామిలీ' లలో ఆయన అసలు 'ఫామిలీ' ఎవరనేదే? అందువల్ల బ్లాకుమెయిలర్సుకి రాజపోషకుడిని మించిన 'ఐడియల్ విక్టిం' మరొకరు దొరకరనేది పచ్చి నిజం!

మహారాజ పోషకుడికివన్నీ తెలిసిన విషయాలే కదా? కొబట్టి ఆయన క్లబ్బులోకి వస్తూ "ఎవరు ఎవర్ని " అని అడగటంలో ఉద్దేశ్యం యిప్పుడు రాజపోషకుడ్ని కొత్తగా ఎవరు బ్లాకుమెయిలు చేస్తున్నారో తెలుసుకుందామనే! ఇది పసిగట్టే రాజపోషకుడు విషయాన్ని జనరలైజు చేసి పారేశాడు — అమ్మవారి బొమ్మకు నవ్వు తెప్పించే విధంగా.

ఇలాంటి జనరాలిటీస్‌కి జనరలుగా సమాధానం చెప్పటంలో మక్కువ, నేర్పు కలవాడు, మనవాళ్ళయ్య.

"మన గూఢచారి సంస్థ వుందా? దానికంతటికీ పెద్ద ఎవరో ఒకరు వుంటారుకదా? ఆ ఒకరు దేశంలో ఎవరినైనా, ఏ పాయింట్ ఆఫ్ టైములో నయినా, బ్లాకుమెయిలు చెయ్యగలరు" చిటికెలేస్తూ ఆన్సరు చెప్పాడు మన వాళ్ళయ్య.

అంతలావు బల్లగుద్దిన జోర్సుకే కదలని ఫోటో చిటికెలకు కదులుతుందా? ఈసారి కులాసాగా గోడనే వుండి, దిలాసాగా నవ్వింది. అమ్మవారి ఫోటో.

"చేసెయ్య గల రనేనా, చేస్తున్నారని కూడానా?" అందుకున్నాడు ముక్తసరిరావు. ఆయన ఏం మాటలాడినా ముక్తసరిగానే మాటాడుతుంటాడు.

"ఏం చేస్తున్నారంటావు?" అని కోపంగా అడిగాడు మహారాజ పోషకుడు. ఆయనకి ముక్తసరి మాటలంటే మహా కోపం మరి.

"బ్లాకుమెయిలు" — అన్నాడు ముక్తసరిరావు—ఒకటో, అరో ప్రతిపక్ష సభ్యులున్న

అసెంబ్లీలో ముఖ్యమంత్రులు సమాధానాలు చెప్పే ముక్తసరితో.

"ఎవరు, ఎవర్ని బ్లాకుమెయిలు చేస్తున్నా రంటావు?" మళ్ళా అడిగాడు, మ.రా.పో.

"మనం మళ్ళా మొదటికొచ్చాం" అన్నాడు ము.స.రావు—ఒకరో, అరో ప్రతిపక్ష సభ్యులున్న పార్లమెంటులో పాలసీ వుపన్యాసాలు చేసే ప్రభువుల ముక్తసరితో.

ఇకనీ ము.స.రావుతో ఎంత మాటాడినా యింతే; అందుకే మాట మార్చాడు మ.రా. పోషకుడు—"ఎవరు, ఎవర్ని బ్లాకుమెయిలు చేసినా, చెయ్యకపోయినా, మా గోపాలాన్ని మాత్రం యిక నెవ్వరూ బ్లాకుమెయిలు చెయ్యలేరు."

"అబ్సర్డు. ఎవ్వరూ, ఎప్పుడూ బ్లాకుమెయిలు చేయటానికి వీలులేకుండా వుండటం అసంభవం," అన్నాడు రాజపోషకుడు—తన అనుభవాన్ని పురస్కరించుకొని.

"అబ్సర్డా. వాట్ అబ్సర్డ్! అబ్సర్డు కానిదే నేను చెప్తుంటా. మా గోపాలాన్ని యిక నెవ్వరూ బ్లాక్‌మెయిల్ చెయ్యలేరు. తెలుసా?"

"ఎందుకనిట? ఏమిటట, అతనిలో వున్న ప్రత్యేకత?" అనడిగాడు, మనవాళ్ళయ్యా.

"అదా, అదో పెద్ద కథలే" అన్నాడు మ.రా.పో. కళ్ళు చికిలిస్తూ.

"ఇప్పుడా పెద్ద కథ చెప్తారు కాబోలు" అన్నాడు ము.స.రావు—కళ్ళు చిట్లిస్తూ.

"ముక్తసరిగానే చెప్పండి పోనీ" అంటూ ముక్తసరిరావును వెక్కిరించాడు రా.పో. కథలన్నా, కాకరకాయలన్నా ఆయనకు యిష్టం మరి!

"రెండో ప్రపంచ యుద్ధానికి ముందు మా గోపాలం " కథ ప్రారంభించాడు, మ.రా. పోషకుడు.

"గోచీ లేకుండానే తిరిగేవాడు" పెద్ద జోకుతో అడ్డొచ్చాడు, ము.స.రావు.

క్లబ్బంతా దద్దరిల్లిపోయింది, నవ్వులతో.

"ష్యూర్. ష్యూర్. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు మా గోపాలం గోచీ లేకుండానే తిరిగేవాడు; నిజంగా. ఎందుకనంటే, అతనికి గోచీలు పెట్టుకోవలసిన అవసరం వచ్చేసరికి రెండో ప్ర.యు. ఆగిపోయింది. గోపాలం వాళ్ళ నాన్న పెద్ద శాంతికాముకుడు—మన నిక్సను, మావో, ఇందిరలకు మల్లే. అందుకని ఆయన యుద్ధం రోజుల్లో కరువొచ్చే అనేక వస్తువుల్ని గోడౌన్లలో నిల్వచేసేవాడు-వాడకందార్ల సౌకర్యంకోసం. అందువల్ల యుద్ధం ఆగిపోవటంతో ఆయన గుండె ఆగిపోయింది. ఆయన భార్య అంతకు ముందే చనిపోవటంతో, అమ్మా, నాన్న లేని గోపాలం వాళ్ళ అత్తమ్మ పోషణలోకి వెళ్ళిపోయింది, యుద్ధం అగిన తర్వాతనే. అత్తమ్మ కప్పటికి వళ్ళో ఓ కూతురు, కడుపులో ఓ కూతురు. ఇద్దరు మరదళ్ళ బావగారైన గోపాలానికి గోచీ పెట్టుకోవలసిన అవసరం కలిగింది కూడా-ఆ విధంగా-రెం.ప్ర.యు. ఆగిపోయిన తర్వాతనే. సో, విట్టేవేసినా మన ముక్తసరిరావు "

"అయన విట్లతో మీ కెందుకు లెండి—కానివ్వండి" ఎంకరేజి చేశాడు, రాజపోషకుడు-క.లన్నా, కా.లన్నా వుండే ఇష్టంతో.

"అప్పుడలా, గోచీలు పెట్టుకోటం ప్రారంభించిన మా గోపాలం యిరవై ఏళ్ళ వాడై వుండగా, ఒకరోజున "

* * *

"ఏయి బావా, ఆఖరుసారిగా అడుగుతున్నాను. యిలా వస్తావా, రావా?" అని గోపాలాన్ని దబాయించింది — అతను గోచీ పెట్టుకోటం ప్రారంభించే నాటికి, అప్పటికింకా అమ్మ కడుపులోనే వున్న అత్తమ్మ కూతురు రాధ.

"పండు వెన్నెల—మల్లెలు పరిచింది—జగత్తునిండుకూ. విశాలమైన డాబా. అందంగా మంచంమీద చేరిన చిన్నారి.

పిట్టగోడ దగ్గర నుంచొని, మనసును ఏ ఎన్నికల సంరంభంలోనో పోగొట్టుకున్న వాడిలా, ఎటో చూస్తూ నిలబడ్డాడు, గోపాలం.

"అదికాదు రాధా..." ఏదో చెప్పబోయాడు, గోపాలం.



"కాదు లేదు, గీదు లేదు. నేను పది వంట్లు చదివేసరికి, యిలా వచ్చేయాలి. లేపోతే తెల్సుగా. ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి ."

లాభం లేదు. తప్పదు. బ్లాకుమెయిలు! వెళ్ళి మంచం దగ్గర నించొన్నాడు, గోపాలం.

"వెరీ గుడ్. గుడ్‌బాయ్. దా. యిలా కూర్చో" మంచంమీద, తన పక్కన, చోటు చూపించింది, మరదలు మాణిక్యం—అసలు మాణిక్యంలానే వెలిగిపోతూ.

"మనమిలా ఒకే మంచంమీద కూర్చుం టే "నసిగాడు, గోపాలం.

"కూర్చుంటే ఆ . ఏమౌతుందేమిటి? అయినా అలా కూర్చోటం మనకిది మొదటి సారి కాదుగా? ఏం, యిప్పుడవన్నీ మళ్ళా గుర్తుచెయ్యాలా? ఇదిగో, చెప్తున్నాను బావా, నేను మూడు చదివేసరికి ఇక్కడ కూచోవాలి. లేకపోతే తెల్సుగా? ఒన్ రెండు " బ్లాక్‌మెయిలర్లకు మాత్రమే వుండే ధైర్యంతో లెక్క మొదలెట్టింది, రాధ.

గబుక్కున కూర్చున్నాడు, గోపాలం. తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిల్—అని స్వగతం చెప్పుకుంటూ.

"వెరీగుడ్. గుడ్‌బాయ్. ఆ .ఇక యిప్పు డేమిటంటే ఇలా నామీద ఓ చేయి వేసి, రెండో చేత్తో అలా నా ముఖం పట్టుకొని, . ఛీ. నాకు సిగ్గేస్తుందమ్మా ఇదిగో బావా, అలా మొద్దబ్బాయిలా కూర్చున్నావంటే నాకు కోపం వస్తుంది. ఎంచక్కా నా ముఖం చేతుల్లోకి తీసుకుని . ఆ అదే నేనేమో కళ్ళు మూసుకుంటాను. మా బావేమో ఎంచక్కా నా పెదిమల్ని "సిగ్గులు మొగ్గలై పూసినై రాధ ముఖంలో.

"రాధా, రాధా. ఇది అన్యాయం. పెళ్ళికాని వాళ్ళం—మనం యిలాంటి పన్లు చెయ్యవచ్చా? పెద్దవాళ్ళకు తెలిస్తే..." గీపెట్టేడు, గోపాలం-దేశంలోని అన్ని అరిష్టాలకూ ఆ సి.ఐ.ఏ. వాళ్ళ ఎలిబీనే గీపెట్టే జోకరులా.

"ఏం, పెద్దవాళ్ళకు తెలుస్తుందనే భయం యివ్వాళే వచ్చిందా? ఆ రోజు నేను అమాయకంగా నిద్రపోతుంటే అప్పుడు రాలేదా ఈ భయం పెద్ద నంగనాచిలా కబుర్లు చెప్తావు?"

"అదంటే . అది వేరు."

"ఇది చెట్టు. నా కదంతా తెలీదు బావా. నేను పది వంట్లు చదివేసరికి ఆ అంతే, లేకపోతే తెల్సుగా? ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి "

తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిలే. ప్యూర్ అండ్ సింపిల్! రాధ పెదిమల్ని సుతారంగా అందుకొన్నాడు, గోపాలం.

అమృతం తాగిన అప్సరసలా వెలిగి పోయింది రాధ. జిలేబీ మరో రెండు చుట్టలు ఎక్కువ తినిపించబడ్డప్పటి ముఖం పెట్టేడు, గోపాలం.

"వెరీగుడ్. గుడ్‌బాయ్. స్వీట్ బావా?" ఆనందంతో పొంగిపోయింది, రాధ—ప్రజా ఉద్యమాల్ని బ్లాకుమెయిలుతో అణిచేసిన దేశ నాయకుల ఆనందంతో.

"కాని. రాధా, ఇదంతా నాకేమీ బాగాలేదు"

"మరి నువ్వా వెన్నెలరాత్రి చేసిన పని నాకు బాగుంటుందో లేదో అడిగే చేశావా? నేనిప్పుడు నీకు బాగులేదని మానెయ్యటానికి?" తెగిన వజ్రాల హారంతో పక్కమీద చెల్లా చెదురుగా పడిపోయింది, రాధ అందం.

* * *


ప్చ్. అదండీ సంగతి!

ఆ వెన్నెల రాత్రి గోపాలం దురుసుపని చేసిన మాట నిజమే. అప్పటి పరిస్థితి అలాంటిది, మరి. ఆ కష్టింంపే వేరు. దాన్నే పట్టుకొని, తననిలా రోజుకోసారి బ్లాకుమెయిలు చెయ్యటం ప్చ్ ఏం బాగాలేదు.

ఒక ఆడపిల్ల—అందమైనదే ననుకోండి-సొంత మరదలే ననుకోండి—కాబోయే భార్యే ననుకోండి—అయితేమాత్రం, రోజూ తనచేత యిలా కాని పన్లు చేయించడం ప్చ్ ఏం బాగాలేదు.

అసలిలా జరుగుతుందని తెలిస్తే, ఆ వెన్నెల రాత్రి ఆ దురుసు పనిచేసి వుండేవాడు కాదు, గోపాలం.

## (వి) చిత్ర విజ్ఞానం



12 సంవత్సరాలకోసారి అలహాబాదులో జరిగే "కుంభమేలా" మహోత్సవానికి దాదాపు 50 లక్షల హిందువులు దేశం నలుమూలలనుండి వస్తారు. ఇంత పెద్ద ఉత్సవం ప్రపంచంలో మరెక్కడా జరగదని "గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు" లో పేర్కొనబడివున్నది. ఇటీవల 1977 లో జరిగిన యీ ఉత్సవానికి 950 రైళ్లు దేశం అన్ని మూలలనుండి అలహాబాదుకు నడుపబడినాయి!

---

ఆ రోజు కూడా ఈరోజు లాగే వెన్నెల మల్లెలను పరిచింది. చదివి, చదివి అలిసి పోయిన గోపాలం కాస్తంత గాలి పీల్చుకుందామని డాబా పైకి వెళ్ళాడు. అబ్బ, ఎంత మనోహరంగా వుంది రాధ!

మంచులాంటి వెన్నెల వేసవికే చల్లదనాన్నిస్తున్నది. హంస రెక్కల్లా తెల్లగా వున్న పరుపు. దానిపై తెల్లటి బట్టల్లో వెలిగిపోతున్న తేజోరాశి రాధ!

చిందర వందరగా వున్న ఆమె జుట్టులో చిక్కుకుపోయినై మల్లెలు. ఆ మల్లెల వాసనలతో మత్తెక్కి మెల్లగా వీస్తున్నది గాలి. ఆ గాలి పీల్చిన గోపాలానికి మతే పోయింది. ఆ పెదిమలు ఎర్రటి ఆహ్వానాలను వేటినో అందించినై. ఆ ఆహ్వానాలను తోసిపుచ్చలేక మెల్లగా ఆమె పక్కన చేరి ఆ ఎర్రటి పెదిమల్ని అలా అందుకున్నాడు గోపాలం.

అమృతం తాగానని మురిసిపోయాడు ఆ క్షణంలో. ఆదిలా అజీర్ణం మాత్రలా వుండుండి గుర్రుమంటుందని వూహించలేదు. అతనలా పెదిమల్ని అందుకున్నాడో లేదో కలువ కన్నులు విచ్చుకున్నాయి వెన్నెల తాపు కన్నట్లు. "ఓ నువ్వా బావా! యూ నాటీ బాయ్! ఏం పన్లివి?" ఏవో చిలిపి పనులుచేస్తూ చిక్కిపోయిన గోపాలకృష్ణుని మందలించే గోపికల కోపంతో మందలించింది రాధ.

"ఆ ఆ అది కాదు రాధా వూరికే" కంగారుపడిపోయాడు గోపికల ట్రైనింగు బొత్తిగా లేని గోపాలం.

"ఊరికేనేం, పాపం వుండు, అమ్మతో చెప్పి "

"అమ్మతోనా, వద్దు రాధా వద్దు. అమ్మతో చెప్పొద్దు."

"చెప్పొద్దూ? ఏమమ్మా ఏం?"

"అత్తమ్మతో చెప్తే, అత్తమ్మే మో .. మరే అదే నాచేత జిలేబీలు తినిపించేస్తుంది వోక్ ."

"హ హ హ " ఎంత హృద్యంగమంగా నవ్వింది, రాధ! అయితే చెమటలు కక్కుతున్న గోపాలానికా నవ్వు షోకు తెలియలేదు.

ఇంతలో సీరియస్సయిపోయింది రాధ.

"మరయితే అమ్మతో చెప్పను కాని నేను చెప్పినట్లు వేస్తావా?"

బుర్ర వూపేశాడు గోపాలం "చిత్రగుప్తుడి" చిట్టా ముందు పెట్టి దేనికి బుర్ర వూపమంటే దానికి బుర్రవూపే చోటా నాయకులలా.

"ఐతే, ఏదీ మరోసారి " కళ్ళు మూసుకొని, పెదిమల్ని మొగ్గలుగా ముడిచింది, రాధ—భువన మోహన బాల.

"ఆ " అని నోరు తెరిచాడు గోపాలం- ఏదో మత్తులో వోట్లు గుద్దేసి తర్వాత ఐదేళ్ళు

నోరు తెరుచుకొని కూర్చుండే వోటరులా.

"ఆ లేదు.. గీలేదు. నే చెప్పినట్లు చెయ్యాల్సిందే; లేకపోతే. అమ్మతో చెప్పేస్తాను. తెల్సుగా?"

బ్లాకుమెయిలే! అయితే మాత్రం తప్పేదేముంది? రాధ ముద్దును చెల్లించక తప్పలేదు గోపాలానికి.

"వెరీ గుడ్. గుడ్ బాయ్. గో అండ్ హావ్ స్వీట్ డ్రీమ్స్" బావకు పర్మిషను మంజూరు చేస్తూ, స్వీటు డ్రీమ్స్‌లోకి జారిపోయింది, డ్రీమ్ గరల్, రాధ.

ర ర ర

అలా ప్రారంభమయిందండీ, ఈ వెన్నెల బ్లాకుమెయిలు; ప్యూర్ అండ్ సింపిల్ బ్లాక్ మెయిలు.

అత్తమ్మంటే గోపాలానికున్న భయం "చిత్రగుప్తులంటే" మన 'సోషలిస్టు' మంత్రులకుండదు. ఆ అత్తమ్మకేమో ఈ రాధ ముద్దుల కూతురు. కాకపోతే అత్తమ్మ చెపుతూనే వుంటుందనుకోండి-మా రాధను గోపీగాడి కోసమే పెంచుతున్నానూ అని. వూరికే అనటం మాత్రమేనా?

"ఒసేయి అమ్మడూ! అంతటి ఎర్రటి వోణీలు వేసుకుంటే బావ భయపడ్తాడే. చక్కగా లైటు కలర్సు వేసుకో" అని రాధను మందలిస్తుంది కూడ అత్తమ్మ.

"అమ్మడూ, నువ్వా జిలేబీలు తినకే! అవంటే బావకు డోకుగదా!" అని కూడ అలవాట్లు మప్పుతుంటుంది, అత్తమ్మ.

అంతేకాదు! "ఒరేయి గోపీ, మా రాధ ఎప్పుడు ఏది కావాలంటే అప్పుడది చేస్తుండాలి. లేకపోతే మా రాధకు కోపం వస్తుంది" అని గోపాలాన్ని మందలిస్తూ, కళ్ళు వత్తుకుంటుంది అత్తమ్మ.

రాధ డిగ్రీ అయిపోతుంటే నువ్వింకా ఈ యం. ఏ లోనే వుంటే ఎలాగురా? త్వరగా డాక్టరేటు చేసెయ్యి" అని రాధ కాలేజిలో చేరిన రోజునుంచీ గోపాలాన్ని తొందర చేస్తూనే వుంది, అత్తమ్మ.

అలా గోపాలంకోసమే రాధను పెంచింది అత్తమ్మ.

రాధ కోసమే గోపాలాన్ని పెద్దవాడ్ని చేసింది అత్తమ్మ.

అయితే మాత్రమేం! అత్తమ్మ చండశాసనురాలు స్టాలిన్‌కంటె, హిట్లరుకంటే, మన ఇందిరమ్మకంటె కూడ. వెన్నెల మాయకు, మల్లెల మత్తుకు లోబడిపోయి గోపాలమిలాంటి చిలిపి పని చేశాడని తెలిస్తే అత్తమ్మ వూరుకోదు. జిలేబీలు తినిపిస్తుంది.

జిలేబీలంటే బలే డోకు గోపాలానికి చిన్నప్పటినుంచీ. చిన్నప్పుడు తను మందు తాగనని మారాం చేస్తే జిలేబీల పళ్ళెం ముందు పెట్టి బ్లాకుమెయిలుచేసి, అతనిచేత మందు తాగించేది అత్తమ్మ.

పండక్కి తలంటు పోసుకోనని గోపాలం మొండికేస్తే "అయితే యివ్వాళ జిలేబీలే చేస్తాను. జాంగ్రీలు చెయ్యనే చెయ్యనని" అతగాడ్ని బ్లాకుమెయిలు చేసి తలంటు పోసేది అత్తమ్మ.

"రాధను పిక్నిక్‌కు తీసుకుపోకపోతే నీ పిక్నిక్ బాగ్‌లో అన్నీ జిలేబీలే పెట్టేస్తాను భడవకానా" అని బెదిరించి ఆ "పిల్లి"ని తోడుగా పంపేది అత్తమ్మ.

చిన్నప్పటినుంచి ఇలా జిలేబీల బ్లాకు మెయిలుతో సతమతమైపోతున్నాడు గోపాలం.


అది వదిలించుకోటమే ఎలాగురా బాబూ అని గొడవ పడుతున్న గోపాలానికి వెన్నెల బ్లాకుమెయిలు కొత్తగా వచ్చి పడింది-ప్రజలనెలా వదిలించుకోవాలిరా బాబూ అని బాధ పడుతున్న మంత్రిగారికి "చిత్రగుప్తుడి" బెడద వచ్చి పడ్డట్లు.

* * *

చిటికెలేస్తూ ఆవలించాడు ము. స. రావు. అతగాడికి కథలంటే ఇష్టమేగాని ఇష్టమున్నట్లు కనిపించటం ఇష్టం లేదు.

"బయట వరండాలో బల్లలున్నాయి-నిద్ర పోయేవాళ్ళు నిద్రపోవచ్చు" అంటూ కథను

## (వి)చిత్ర విజ్ఞానం



ఈ చిత్రం ఎవరిదో చెప్పుకోండి చూద్దాం!

సోమర్ సెట్ మామ్?

మార్క్ ట్వైన్?

బెర్ట్రండ్ రస్సెల్?

ఐన్‌స్టీన్?

సమాధానం 87వ పేజీలో!!

కొనసాగించాడు మహారాజపోషకుడు.

* * *

ఇవేగాక యింకా యిలాంటివి ఎన్నో బ్లాకుమెయిలు బాధలుండేవి గోపాలానికొకప్పుడు.

మచ్చుకి మరొకటేమిటంటే గోపాలం చాలా మంచివాడుగదా.... దానివల్ల ఎన్ని బాధలో?

మా గోపీ చాలా మంచివాడమ్మా - అంటుంటుంది అత్తమ్మ నిరపాయకరంగా.

మా బావ చాలా మంచివాడు అనుకుంటుంది రాధ తియ్యగా.

మా గోపాలం బావ చాలా మంచివాడు అంటుండేది ప్రేమ అత్యంత ప్రమాదభరితంగా.

ప్రేమంటే అత్తమ్మ పెద్దకూతురు. కాస్తంత పర్మిసివ్ భావాలున్న పడతి. ఈ ప్రేమకు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోవటంతో కాస్తంత రిలీఫ్ దొరికింది గోపాలానికి. అబ్బ, ఎంత ఏడిపించేదో! గోపాలం మంచితనాన్ని ఆసరాగా తీసుకొని అతన్నెంతగా బ్లాకుమెయిలు చేసేదో?

నీళ్ళు పోసుకొని వంటికి టవలు చుట్టుకొని గబుక్కున గోపాలమున్న గదిలోకి వచ్చేసేది ప్రేమ. "ఓ బావా, నువ్వా? ఎవరో మగవాళ్ళన్నారని హడలిపోయాను" అంటూ ఆ టవలు అవతల పారేసి గోపాలం కళ్ళెదుటే వస్త్రాలంకరణ ప్రారంభించేది - తన కళ్ళ ముందు గోచీ లేకుండా తిరిగిన అతగాడంటే భయమెందుకులే అని కాబోలు!

పోన్లే, ఈ ప్రేమకూడ తన ముందు గౌన్లు లేకుండా తిరిగిన పిల్లేకదా - రెండో ప్రపంచ యుద్ధం ఆగిపోయిన కొత్తల్లో అని ఆ అలంకరణని ఆసక్తితో తిలకించేవాడు గోపాలం. అప్పుడలా గౌన్లు లేకుండా తిరిగిన పిల్ల, ఇప్పుడబ్బా! ఎంత అలంకరణో!

ఒకనాడలాగే ముచ్చట తీర్చుకుంటున్న గోపాలాన్ని ముక్కు పట్టుకొని నిలేసింది ప్రేమ. "ఏంటమ్మా, అలా చూస్తావు? ఓ ఆడపిల్ల బట్టలేసుకుంటుంటే అలా చూడొచ్చా?"

"అబ్బే....ఎలా చూశాను? ఎలా చూశాను! అబ్బే...." కంగారుపడిపోయాడు గోపాలం - పోటరు చేతిలో జుట్టు ఇరుక్కుపోయి అతనికి సంజాయిషీ చెప్పవలసి వచ్చిన ప్రజానాయకుడికి మల్లే.

"ఆ....ఎలా చూశావా! చెప్తాను. ఎలా చూసిందీ అమ్మతోనే చెప్తాను"

"అత్తమ్మతోనా? వద్దు, ప్రేమా ప్లీజ్. అత్తమ్మతో చెప్తే జిలేబీలు తినిపించేస్తుంది" ప్రాణరహస్యాన్ని బాలనాగమ్మకి చెప్పేసిన మాయల మరాఠీ తప్పు చేసేసాడు గోపాలం.

ఇంకేం, దానితో మొదలయింది ప్రేమ బ్లాకుమెయిలు.

"అయితే అమ్మతో చెప్పనుగాని నేను చెప్పినట్లు చేస్తావా?"

బుర్ర వూపేశాడు గోపాలం - వోట్లు ఎదురుగుండా చూపెట్టి దేనికి బుర్ర ఊపమంటే దానికి బుర్రవూపే ప్రజాసేవకుడిలా.

"వెధవ టైలరుగాడు - వెనక గుండీలు పెట్టద్దురా అంటే విని చావడు. బావా బావా, యిలా వచ్చి ఈ జాకెట్టు గుండీలు పెట్టవూ, ప్లీజ్!" అడిగిందానికల్లా బుర్ర వూపేసిన బోళాశంకరుడికి భస్మాసురుడు పెట్టినట్లు గోపాలానికి టెస్టుకేసు పెట్టింది ప్రేమ.

"ఛ-ఛ. నీ జాకెట్టు గుండీలు నేను పెట్టటమేమిటి? ముందా వోణి వేసుకో" కళ్ళు మూసుకున్నాడు గోపాలం.

"అలాగేం అయితే అమ్మతో చెప్పి "

తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిలు. ప్యూర్ బ్లాక్‌మెయిలు. అనుకుంటూనే 'టైలరు వెధవ' చేసిన తప్పును దిద్దాడు గోపాలం.

"గుడ్ వెరీ గుడ్. అట్లా బుద్ధిమంతుడల్లే " విలాసంగా ప్రేమ వేసుకుంటున్న వోణీ, వేడిగా గోపాలం ముఖాన్ని రుద్దుతూ, ఏవో లోకాలకు ఎగిరిపోయింది.

* * *

ఈ ప్రేమకే పెళ్ళి మాటలు నలుగుతున్న రోజుల్లో పెద్ద రిలీఫు ఫీలయ్యాడు గోపాలం అసెంబ్లీ వాయిదా పడటంతో ప్రతిపక్షాల బెడద వదలిపోయిందని రిలీఫ్ ఫీలయ్యే ప్రజానాయకుడిలా.

ఆ రిలీఫుతో అతనికెంతో ఉల్లాసం వచ్చింది. ఆ ఉల్లాసంతో అతనెళ్ళి ప్రేమను రెచ్చగొట్టాడు-అదోరకమైన హిప్పీ మత్తులోంచి.

అప్పటికి కొన్ని గంటలుగా ముబ్బుపట్టి తుఫాను వాన, గాలులతో వాతావరణమంతా ఏదో హాయిగా మాయగా వుంది. ఆ హాయికి ప్రేమ వళ్ళంతా వేడెక్కిపోయి కూర్చుంది. మార్జువానా తాగిన వాళ్ళకు మోస్తరుగా మత్తుగా ఏదో గమ్మత్తుగా వుంది ప్రేమకు. అలాంటి ప్రేమనే రెచ్చగొట్టాడు పిచ్చి గోపాలం.

"అవును ప్రేమా, నీకు పెళ్ళట తెల్సా? ముహూర్తాలు కూడ " అంటూ తనలోని ఆనందాన్నంతా వెడలగక్కేశాడు - అసెంబ్లీ బాధ వదిలిపోగానే టూరుకి బయలుదేరెళ్ళిపోయే మహామాత్యుడి ఆనందంతో.

"అవునట. పెట్టేశారుట" బయటి మేఘాలకన్నా నల్లటి ముఖం పెట్టేసింది ప్రేమ.

కాని, అంతలోనే ఆమె ముఖం కుంకుమ పువ్వు రుద్దుకొన్నట్లు ఎర్రబడి పోయింది. గోపాలం భుజాలమీదనే చేతులేసి ఎర్రగా, కసిగా అడిగింది ప్రేమ "అయితే బావా, ఆడదానికి పెళ్ళెందుకంటావు?"

"ఎందుకేమిటి, మొగుడి కోసం."

"మొగుడెందుకట?"

"మొగుడెందుకూ? అదేం ప్రశ్న? మొగుడు కావద్దూ?"

"అదే, ఎందుకూ అంట?"

"బలే. బలే. మొగుడెందుకంటే ఏమో నాకు తెలీదు."


"తెలీదేం పాపం మొగుడెందుకో చెప్పలేని బుజ్జిపాపాయివి ఇప్పుడొచ్చి నన్నెందుకు ." గోపాలం బుజ్జి బుగ్గల్ని బూరెలు చేసింది, ప్రేమ. "కాదు నీకు తెల్సు. చెప్పాలి. లేకపోతే అమ్మతో నా గుండీలు పెట్టేశావని చెప్పేస్తాను."

"అత్తమ్మతోనా, వద్దు ప్రేమా, ప్లీజ్."

"అయితే ఆడదానికి మొగుడెందుకో చెప్పు."

చిక్కులో పడ్డాడు గోపాలం. ఆన్సరు తెలియని ప్రశ్నలడిగి, పేంబెత్తం పుచ్చుకునే పొడుం మాస్టారిలా వుందీ ప్రేమ తంతు. తెలీని ప్రశ్నకు తానేమని సమాధానం చెప్పగలడు? ఇదేమన్నా జాకెట్టు గుండీలు పెట్టేయటమా, పోనీలే అని పెట్టెయ్యటానికి. ఆ గుండీలు

"ఆ ప్రేమా మొగుడెందుకంటే టైలరు వెధవ వద్దన్నా వినకుండా వెనుక గుండీలు పెత్తే పెట్టటానికి" ఆన్సరిచ్చాడు




గోపాలం- చదివిన చదువునుంచి కాక, క్వశ్చను పేపరునించే ఇన్స్పిరేషను పొంది పరీక్షలు రాసే ఏదో ఛాన్స్ విద్యార్థిలా.

"ఛీ పో బావా నీకేం తెలీదు. మొగాళ్ళింత మంచివాళ్ళయితే ఎలాగమ్మా!" అంటూ మంచం, పక్కా దున్నేసింది పర్మిసివుభావా లున్న ప్రేమ-బ్లాకుమెయిలు చేసినా రాజీనామా యివ్వని రాష్ట్రనాయకుడ్ని చూసి రొష్టుపడే కేంద్రనాయకుల కోపంతో.

అలా తన మంచితనంవల్ల వచ్చిన చిక్కు నుండి ఆ మంచితనం సహాయంతోనే బయట పడ్డాడు గోపాలం అప్పటికి ఆ రోజుకి.

* * *

మరో రోజున ఏం జరిగిందంటే

పెళ్ళయి కాపురాని కెళ్ళిన ప్రేమ పండక్కి దేనికో పుట్టింటి కొచ్చింది. వచ్చిన పదోరోజున కాబోలు నీళ్ళోసుకుందామని స్ట్రిప్‌టీజ్ ప్రారంభించింది. గోపాలం అక్కడే ఆమె కళ్లెదుటే వున్నా అతగాడు తన కళ్ళెదుటే గోచీల్లేకుండా తిరిగినవాడేగదా. స్త్రానార్థియై అలా ఏదో చేస్తున్నదల్లా కెవ్వున కేకెట్టి "బావా, హెల్ప్ హెల్ప్" అని అరిచింది ప్రేమ. ఏమయిందోనని కంగారుగా పరిగెత్తాడు గోపాలం,

"ఈ గొలుసు చూడు బావా, జాకెట్టు గుండీల్లో ఎలా చిక్కడిపోయిందో? జాగ్రత్తగా విడిపించవూ?" బ్రతిమలాడింది ప్రేమ.

ఎ,డామ్సెల్ యిన్ డిస్ట్రెస్! సహాయం చెయ్యకపోవడం షివల్రీ కాదు.

జాగ్రత్తగా ఆ గుండీలు విప్పి గొలుసును విడదీసాడు గోపాలం.

"థాంక్స్ బావా, మరింక గుండీలు పెట్టేయి."

"అదేంటి, ఎట్లాగూ నీళ్లోసుకోబోతున్నావుగా?" అమాయకంగా అన్నాడు గోపాలం- సైలరు వెధవ తప్పు చేయకుండా ముందు వైపే పెట్టి కుట్టిన ఆ 'గుండీల్ని' మరో మారు ముట్టుకోవటం యిష్టంలేక కాబోలు!

"ఆ అయితే నేను నీళ్ళోసుకుంటుంటే కొంటె కిష్టుడిలా నువ్వు చూస్తూ కూర్చుంటావన్నమాట. అమ్మదొంగా, ఏం బుద్ధులివి? వుండు, అమ్మతో చెప్పి "

"అత్తమ్మతోనా! వద్దు ప్రేమా ప్లీజ్. జిలేబీలు తినిపించేస్తుంది."

"అయితే గుండీలు పెట్టేసెయ్యి."

తప్పదు. బ్లాకుమెయిలే. అయినా అనుకుంటూ బుద్ధిగా గుండీలు పెట్టేశాడు, గోపాలం.

దాంతో గోచీల్లేకుండా తిరిగిన రోజులకంటే ఏమాత్రం ఎదగని ఆ కుర్రాడ్ని చూచి గుర్రుమంది ప్రేమ. "ఏం బావా, గుండీలు పెట్టెయ్యమంటే అలా పెట్టెయ్యటమేనా?" అంటూ తుమ్మెదను పువ్వుల బాల చూచే చూపుతో గోపాలాన్ని చూసింది ప్రేమ. పెళ్ళయినా పర్మిసివు భావాలు వదిలిపెట్టని పడతి.

కానయితే తుమ్మెద రెక్కలు మూసుకొని నిద్రతో జోగిపోయింది "మరింకేం చేస్తారేంటి?" అంటూ.

"ఛీ పో బావా ఇంత మంచయితే ఎట్లాగమ్మా?" పువ్వుల బాల ముడుచుకుపోయింది వెదజల్లుకుందామనుకున్న సౌరభాలను తనలోనే దాచుకుంటూ

మరోసారి కూడ అలా తన మంచితనం వల్ల వచ్చిన చిక్కునుంచి 'థాంక్సు టు దట్ మంచితనమ్' తప్పించుకున్నాడు గోపాలం బ్లాకుమెయిలోపహతుడు.

* * *

ఆ గుండీల బ్లాకుమెయిలు అలా కాస్త వెనుకపడుతూ వుండగానే ఇప్పుడీ వెన్నెల బ్లాకుమెయిలు!

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తున్నది, డాబా మీద. వెన్నెల్లో మంచం మెరిసిపోతున్నది. ఆ వెన్నెలకే మెరుపును యిస్తున్నది ఆ మంచం మీద పడుకున్న రాధ.

" లేకపోతే తెల్సుగా? ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి " అంటూ మధువు నందించింది మధుపం.

తప్పదు. లాభంలేదు. బ్లాకుమెయిలు! ప్యూర్ బ్లాక్‌మెయిలు అని స్వగతం చెప్పుకుంటూ కరక్కాయ కషాయంలా దాన్నందుకున్నాడు గోపాలం.

"కాని, రాధా, పెళ్ళికానివాళ్ళం, మనమిలా చెయ్యటం " ఆరిగిపోయిన సి. ఐ. ఎ. ఎలిబీ' వినుగెత్తింది రాధకు.

"అలా పెళ్ళికానివాళ్ళం, పెళ్ళికానివాళ్ళం అంటూ నా ప్రాణం తియ్యకపోతే, ఆ పెళ్ళేదో చేసుకుంటే నే కాదన్నానా?" అంటూ గవర్నమెంటు కాంట్రాక్టులు ఎలా పట్టుకోవాలో, ఆ రహస్యం చెప్పేసిన మంత్రిగారిలా మురిసిపోయింది రాధ.

* * *

సీరియస్సుగా ఆలోచించాడు గోపాలం చిన్న చిన్న ఆమ్యామ్యాలు పట్టి చిత్రగుప్తుడికి దొరికిపోయేకంటే అసలు మురానాయుడ్నే పట్టేస్తే బాగుండును కదా అని ఆలోచించే మన ప్రజాసేవకులకి మల్లే.

"ఈ కుర్రగాడెవడో మనల్నే చిత్తు చేయాలని ఆలోచిస్తున్నాడే! పిల్లకాకి" అనుకుంటూ ఉండేలు దెబ్బ నవ్వులు నవ్వినట్లుగా కదిలింది ఎదురుగా గోడకున్న అమ్మ ఫోటో!

ఈ ఉండేలు దెబ్బల సంగతి ఆలోచించే స్థితిలో లేడు వెన్నెల బ్లాకుమెయిలుతో వుక్కిరిబిక్కిరై పోతూన్న గోపాలం. అంతే అలా చెయ్యాల్సిందే రాధ సూచించినట్లు. ఆ కాంట్రాక్టులు, ఎగ్రిమెంట్లు అధికారికంగానే పూర్తిచేసుకుంటే, యిక నీ రహస్యపు లంచాలు, వెన్నెల బ్లాకుమెయిలులు వుండవు. పెళ్లి చేసుకుంటే

"ఏమిటీ! పెళ్ళి చేసుకుంటావా, నీచేతసలు నాలుగు జిలేబీలు తినిపించాలిరా, బడవకానా అని. పెళ్ళి చేసుకుంటాట్ట. ఇంకా డాక్టరేటు అవలేదు. అమ్మాయి డిగ్రీ ఏమో అయిపోవస్తున్నదీ " అంటూ కోప్పడిపోయింది అత్తమ్మ యువరాజకుమారుని ముద్దులకారు పేరెత్తితే మండిపడే అమ్మగారి పార్లమెంటు సభ్యుడిలా.

"అదికాదు అత్తమ్మా. నా థీసిస్ కాయితాలు ఫెయిర్‌కాపీచేసి పెట్టమంటే రాధ రలాయిస్తున్నది కదా! రేపు పెళ్ళయిపోతే దబాయించి అవన్నీ రాధచేత కాపీచేయించి, సబ్మిట్ చేస్తే రెండోరోజు కిచ్చేస్తారు డాక్టరేటు. అంత బాగుంటుంది కదత్తమ్మా రాధ దస్తూరీ' నా దస్తూరి ఏమో "

"ఆ ఆ నాకు తెల్సులే. నీ దస్తూరి కూడ నీ వుంగరాల జుట్టుకిమల్లే ఛంకిరి చిం

రేగా! అయితే పెళ్ళి కాగానే డాక్టరేటు వస్తుందంటావు?"

"వచ్చేస్తుందత్తమ్మా " అంటూ మురిసిపోయాడు తియ్యటి ఆశలు చూపించి వోటర్లను బుట్టలో వేసుకున్న రాజకీయ నాయకుడికి మల్లే.

"సర్లే, శాస్త్రుల్లుగారిని పిలిచి " అంటూ అత్తమ్మ బుట్టలో పడిపోయి వరాలిచ్చేసింది "ముద్దుల కారు"ని మెచ్చుకున్న ముఖ్యమంత్రులకు వరాలిచ్చే మాతృదేవిలాగా.

* * *

శాస్త్రుల్లుగారిని పిలవటం అయిపోయింది. ఆయన ముహూర్తాలు పెట్టటం అయిపోయింది. ఇంకా ఎవరెవరో రావటం, పందిళ్ళు వేయటం హడావుడి చెయ్యటం "మా బావమ్మ పెళ్ళికూతురాయెనే, మా రాధేమో పెళ్ళికొడుకాయెనే" అంటూ ప్రేమ పిచ్చిపాటలు పాడటం ఇదంతా ఏదో కలగా జరిగిపోయింది గోపాలానికి. బ్లాకు మెయిలు బాధ లేకుండానే వెన్నెల మత్తు అనుభవించవచ్చునన్న ఒకే ఒక ఆశతో తన చుట్టూ తిరుగుతూన్న ఆలశ్యం బాధని ఏదోలా సహించేశాడు గోపాలం.

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తున్నది పైన డాబామీద. రాధ కన్నుల్లో వెన్నెల ట్యూబులైట్లకాంతిని మింగేస్తున్నది గమ్మత్తుగా వున్న ఆ గదిలో.

గమ్మత్తుగా వున్న శోభనం గదిలో 'మాయాలోకం' సినిమాలో మాయామోహిని గిరగిర మంచంమీద కూర్చున్న బాల నాగేశ్వరరావు ఫోజులో కూర్చున్న గోపాలానికి అంతా మత్తుగా మాయగా వుంది.

వేలాడదీసిన మల్లెలు మత్తుగా వాసనలు వెదజల్లుతున్నాయి. తన మెళ్ళో వేలాడుతున్న మరదలు ఏవో మాయలు చేస్తున్నది. అగరువత్తుల వాసనలు అదేదో మత్తునిస్తున్నాయి. రాధనించి వికసిస్తున్న పరిమళాలు ఏవో మాయలు చేస్తున్నాయి

ఆ మాయలో ఆ మత్తులో తానేం చేస్తున్నాడో తెలియలేదు గోపాలానికి. ఆఖరికి తనచేత రాధ జీలేబీలు తినిపిస్తున్నదని, తాను అప్పుడే నాలుగు చుట్టలు తినేసానని కూడ తెలియలేదు గోపాలానికి. అప్పుడయినా తెలిసుండేది కాదు రాధ అలా ఆనందం ప్రకటించకపోతే.

"హాయ్, హాయ్ బావా! హిప్ హిప్ హుర్రే! జయం మనదే. విజయం మనదే. నువ్వు జిలేబీలు తినేశావు" అంటూ వివిధ భాషల్లో తన ఆనందాన్ని ప్రకటించేసింది రాధ తాను వోటు వేసిన అభ్యర్థి గెలిచాడని సంతోషం ప్రకటించే వోటరులా.

గెలిచిన అభ్యర్థి అధికారం రుచి మరిగి తననెలా పిప్పరమెంటులా చప్పరించేస్తాడో తెలియదుగదా ఆ వోటరుకి.

జిలేబీలు తినేసి దాని తీపిరుచి మరిగిన గోపాలం తననెలా చికాకు పెడ్తాడో తెలియలేదు రాధకి పాపం!

హెవెన్ హైడ్స్ ద బుక్ ఆఫ్ ఫేట్ ఫ్రం అజ్—పాడుదేవుడు మన భవిష్యత్తుని మననుంచి దాచేస్తాడుగదా!

"ఆ జిలేబీలు తినేశానా వోక్ " అంటూ అవన్నీ డోక్కోవాలని చూశాడు గోపాలం.

డోకు రాలేదు సరికదా, ఆ జీలేబీ తీపి అప్పట్టున ఆ క్షణంలో అతని జీవితాన్నే నింపేసినట్లయింది.

తియ్యదనాన్ని రుచిమరిగిన గోపాలం మరింత తియ్యదనానికి ఎగబడ్డాడు.

పళ్ళెంలో వున్న అన్ని జిలేబీల తీపి అతనికి చాలలేదు.

రాధ పెదవుల్లోని తియ్యదనం అతని ఆర్తి తీర్చలేదు.

మొదటి రాత్రిలోని తియ్యదనం అతన్ని తృప్తిపరచలేదు.

రాధ శరీరం నుండి జాలువారిన తియ్యదనం చాలలేదు. తీపి పిచ్చివాడయ్యాడు గోపాలం!

"దొంగపిల్లా, యింత దగా చేస్తావా?"

అంటూ రాధలో ఆ రాత్రిలో వున్న తియ్యదనానికి ఎగబడ్డాడు గోపాలం.

ఉక్కిరి బిక్కిరయింది రాధకు.

అందుతున్న తియ్యదనం ఆమెకు కాస్త మొహం మొత్తినట్టయింది. కాస్తంత కారం కావాలని కోరుకుంది కారం బంతిపూవులా కందిపోయిన రాధ. "ఏయి బావా, ఏమిటీ అల్లరి? కుదురుగా కూర్చుంటావా లేదా?" తీపిలో కారం నంజుకోవాలని చూసింది రాధ.

"కూర్చోను. ఏం చేస్తావేంటి!" కాలరెత్తాడు గోపాలం. మనవాడేనని ఓటేసినవాడు మంత్రి కాగానే టోపీ సవరించుకున్నట్లు తియ్యదనం కోసం వెర్రి ముచ్చట చూపించాడు గోపాలం. దాంతో వెర్రెత్తిపోయింది రాధకు.

"ఏయి బావా, ఆఖరిసారిగా చెప్తున్నాను. నేను పది వంట్లు చదివేలోగా కుదురుగా కూర్చోవాలి. లేపోతే, తెల్సుగా? ఒన్. రెండు, తీన్, నాల్గి, అంజి, ఆరు, సెవెన్, ఎనిమిది, నైన్, పది" ఒక్కొకటి ఒక్కొ భాషలో చదువుదామంటే అన్ని భాషలు రాక పది ఒంట్లని వెరశి తనకొచ్చిన ఐదు భాషల్లో చెప్పేసింది, రాధ.

అలవోకగా నవ్వుతూ కూర్చున్నాడు, గోపాలం—కార్యవర్ధి రాజు చేతిలో చిలుకను లాగేసుకున్న మాయల మరారీలా.

ఒంట్లు చదవటానికి తనకు పది భాషలు రాలేదేమన్న బాధకంటె, పది వంట్లు చదివినా బావ ఉలక్కపోవటం రాధకు బాధ కలిగించింది. వెర్రిగా ఎగబడ్తున్న బావను గుర్రుగా చూచింది, రాధ. "ఉండుండు, తెల్లారగానే అమ్మతో చెప్పి "

* * *

తెల్లారింది.

"పోన్లే అమ్మా, బావేగదా?" అంది అత్తమ్మ.

కస్సుమంది రాధ — గుర్రుమంటున్న కుక్కను కర్రతో కొడ్తే కస్సుమన్నట్లుగా.

"ఏంటమ్మా, నువ్వు మరీనూ. బావైతే మాత్రం అంత అల్లరి చేస్తాడేం?"

"పోన్లే అమ్మడూ, ఏదో ఉత్తుత్తి అల్లరి చేసుంటాడు."

"అల్లరి ఉత్తుత్తిదేం కాదు. ఆయన నీతో చెప్పిన మాటలే ఉత్తుత్తివి."

"ఆ ఏం చెప్పాడంటావు?"

"అదే నా చేత ధీరీ కాపీ చేయిస్తానని చెప్పలేదూ? అదంతా ఉత్తదే. ఆయనసలు ధీరీ అంతా ఎప్పుడో టైపు చేయించారు" వెన్నెల సంగతి చెప్తే లాభంలేదని, కొత్త యిన్ఫర్మేషన్ ఇచ్చింది.

"ఏమి టేమిటి, అవన్నీ ఉత్త మాటలే. ఓరి భడవకానా! ఉండుండు. జిలేబీలు తినిపించేస్తాను" అంటూ బయలుదేరింది, అత్తమ్మ—చైనావాళ్ళమీదకు ఎస్ప్రెస్సో కాఫీ మిషన్లతో బయలుదేరిన భారతీయ రక్షణ దళాలకు మల్లే.

"తిను, భడవా" అంటూ అత్తమ్మ తినిపించిన జిలేబీలను, ఆనందంగా ఆరగించాడు, గోపాలం.

"ఆ " నోరుతెరుచుకొని వుండిపోయింది, అత్తమ్మ. కాసేపటికామె మురిసేపోయింది - తన అల్లుడింత జగదేక వీరుడైనందుకు. అత్తమ్మ జిలేబీల బ్లాకుమెయిలు ఆ మురిపెంలో మునిగిపోయింది.

* * *

పురిటి కొచ్చిన ప్రేమ, పిల్లవాడ్ని కని, - పిల్లడ్ని వళ్ళో వేసుకొని పాలిస్తున్నది, ఓ వెచ్చటి రోజున—మత్తుగా, గమ్మత్తుగా వున్న రోజున.

"ఏం, ప్రేమా, ఆడదానికి మొగుడెందుకో చెప్పమన్నావా?" అనడుగుతూ ఆ పిల్లడి బుగ్గల్ని ముద్దాడాడు గోపాలం. చక్కిలిగింతలైందేమో, ప్రేమకు - పర్మిసివ్ భావాలిప్పుడు బొత్తిగా లేని ప్రేమకు, "ఏయి బావా! ఏంటా దురుసు? ఫా అవతలికి" కసిరింది, ప్రేమ.

"అహ అదికాదు ప్రేమా, మళ్ళా గొలుసేమన్నా గుండీల్లో యిరుక్కుపోయిందేమోనని చూస్తున్నాను" అంటూ డిస్ట్రెస్సులో లేని డామ్సెలుకి సహాయం చెయ్యబోయాడు.

శివశ్రీ స్పిరిటుతో గోపాలం.

కెవ్వుమంది — కొత్తగా డిస్ట్రెసులో పడ్డ డామ్సెలు, ప్రేమ. "ఏయ్ చిలిపీ" నవ్వుకుంటూ పారిపోయింది ప్రేమ—సైలరు వెధవ తప్పు చెయ్యకుండా పెట్టిన గుండీలను పెట్టుకుంటూ.

ప్రేమ గుండీల బ్లాకుమెయిలు ఆ విధంగా ఆ గుండీల మధ్య క్రష్ అయిపోయింది.

* * *

"ఏయ్ రాధా, ఆఖరుసారినా అడుగుతున్నాను. యిలా వస్తావా, రావా? నేను పది వంట్లు చదివేసరికి రావాలి. లేకపోతే తెల్సుగా? ఒన్, రెండు, తీన్, నాల్గి, అంజి..."

లాభంలేదు. తప్పదు. దొంగబావ! ఏదో దురుసుపని చేసేస్తాడు.

తెల్లని చీరతో తియ్యని వెన్నెల్ని చిదుముతూ, జాజుల వాసనలతో చల్లగాలిని చీల్చుకుంటూ నడిచి వచ్చింది, రాధ.

"గుడ్ వెరీగుడ్ గుడ్ రాధా...ఆ... యిప్పుడేమిటంటే "

"నువ్వేం చెప్పక్కర్లా, దొంగా అని, వెర్రి బావ! పిచ్చిబావ!" అంటూ దొంగబావను వెర్రివాణ్ని చేసి తనను దోచుకోనిచ్చింది, రాధ.

రాధ వెన్నెల బ్లాకుమెయిలు అలా విచ్చిపోయింది.

* * *

"కథ కంచికెళ్ళింది. మనం అయ్ ఇంటికెళ్దాం. పొద్దోయింది అయ్ " ఆవలించాడు, మహారాజ పోషకుడు.

"బ్లాకుమెయిలు చేయించుకొనే గోపాలం యిప్పుడు తానే పెద్ద బ్లాకుమెయిలరు అయిపోయాడన్న మాట. బలే బలే" ఆనందించాడు, రాజపోషకుడు, చిటికెలేస్తూ — ఆ వెన్నెల బ్లాకు మెయిలు కథలో తన'ఫామిలీల' బ్లాకుమెయిలు తప్పించుకోటానికి చిట్కాలేమన్నా దొరుకుతాయేమోనని, ఆ కథను తన చిటికెలతో కెలుకుతూ.

"ఇంతకీ ఈసపుగారు చెప్పేదేమిటో?" ముక్తసరిగా అడిగాడు, ముక్తసరిరావు.

"ఈసప్ ఏమిటి?" విసుక్కున్నారు, మ.రా.పో.

"అదే, తమరుగారు చెప్పిన కథలో ఈసప్ నీతేమిటీ అని?"

ప్రశ్నను వివరించారు ముక్తసరిరావు— తన కొంగు చుట్టూ ప్రదక్షిణాలు చేసే ప్రతి పక్షాల వాళ్ళ ముఖాన మాత్రం మరోనోటి ముత్యాన్ని రాల్చే మహానాయకుడి పోజులో.

"ఏముందీ. బ్లాకుమెయిలు కారం వెన్నెల తీపిలో నంజుకోవాలని మోజుపడే రాధలు, మత్తులో వున్నారుకదా అని మాయచేసి గోపాలంలచేత జిలేబీలు తినిపించకూడదు. అలా తినిపిస్తే "చిత్రగుప్తుల" జుట్టు చేతికి దొరికిన సమసమాజ నిర్మాతలకి మల్లే, వాళ్ళు వెర్రిగా తీపిని దోపిడీ చేసేస్తారన్న మాట. దోపిడీకి జోహుకుం అనాల్సి వస్తుందన్నమాట, రాధలకు" విషయాన్నంతా అలా జనరలైజు చేసేసాడు, మనవాళ్ళయ్య — జనరాలిటీస్‌కి జనరలుగా సమాధానం చెప్పే నేర్పు, మక్కువ గలవాడు కదా, మనవాళ్ళయ్య!

* * *

"అయ్ మా గొప్ప బ్లాకుమెయిలు కథే!" అంటూ ఒకసారి ఆవలించి, మరోసారి కులాసాగా కదిలి, చివరిసారి విలాసంగా నవ్వింది- గోడకున్న అమ్మ ఫొటో లాస్ట్‌లాఫ్ తనదే అవుతుందని ఆశించే మహానాయకుల ఆనందంతో. □

చిత్రం ఎవరిది?

సమాధానం;

మార్క్ ట్వైన్

(1835—1910)